క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న రామ జయంత్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం నెల్లూరుకు చెందిన రామ జయంత్, రామ గీత లక్ష్మి రూ.1,10,116 విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వరూ!

- తహసీల్దార్‌కు వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీయస్పురం గ్రామ దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. వీయస్పురం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 340, 341లోని భూమిని దళితులు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, ఆ భూములకు పట్టాలివ్వాలని ఎన్నోసార్లు ఇవ్వాలని వినతులు ఇచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళితులు మురళి, కృష్ణమూర్తి, కృష్ణయ్య, పోలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస ప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పంగూరులో కూలీలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అవసరమయ్యే పనులను చేయాలన్నారు. మండలంలో ప్రతి రోజూ 3,500 మంది కూలీలు పనులు చేయాలని సూచించారు. రోజువారీ కూలీ రూ.257 వచ్చేలా కొలతలు ఇచ్చి వారితో పనులు చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, క్షేత్ర సహాయకురాలు జ్యోతి, కూలీలు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ రవీంద్రనాథ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని నెలవాయి, పల్లమాల, పార్లపల్లె, కాటూరు గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచి చూసి భోంచేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.


ఆగమోక్తంగా దుర్గా, లక్ష్మీ, సరస్వతి హోమం



దుర్గా, లక్ష్మీ, సరస్వతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్ల హోమం ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల మండపంలో దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్లను కొలువుతీర్చారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట చేపట్టారు. అనంతరం దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్ల హోమం పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు.

కారులో మంటలు



వెంకటగిరి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి వెంకటగిరి నివాసి రాజు అనే వ్యక్తికి చెందిన కారులో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కా రణంగా మంటలు రేగాయి. స్థానికులు కథనం మే రకు.. రాజు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పార్కు చేసి మందుల దుకాణంలో మాత్రలు కొనుగో లు చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో కారు నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు, బాధితుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహు టిన అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

–'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రాచపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టినప్పటి నాటి నుంచి పలు విప్లవాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందాడు పంచాయతీలోని రాచపాలెం, ఎలకమిట్ట ఎస్టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామాల్లోని 290 కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాచపాలెం, ఎలకమిట్ట ఎస్టీ కాలనీలో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యేకు నివేదించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పారదర్శకంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందస్తోందన్నారు. దేశంలో కనీవినీ ఎరగని రీతిలో విప్లవాత్మక చర్యలతో ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్, ఎంపీటీసీ రేవతి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, రాంబత్తి, రమణయ్య యాదవ్, లోకనాధరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పరంధామరెడ్డి, కుప్పాల వెంకటేష్, ఎంపీడీఓ గిడ్డయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

మండలంలోని మడిబాక పంచాయతీలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిర్వహిస్తారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



అమ్మపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్: త్వరలో జరగనున్న చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలో అమ్మపాలెం, పుల్లారెడ్డికండ్రిగ, ఎగువవీధి, తొండమనాడు, టీఎంవీ కండ్రిగ, చుక్కలనిడిగల్లు తదితర గ్రామాల్లో పట్టభద్రులను కలసి ఆయన కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందాటి ఈశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, గంగిరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నారాయణ, చుక్కల కిరణ్ పాల్గొన్నారు.

ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయం ప్రారంభం



సమావేశమైన అసోసియేషన్ నాయకులు

రేణిగుంట: రేణిగుంట రైల్వే కల్యాణ మండపం సమీపంలో ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రేణిగుంట శాఖ కార్యాలయాన్ని శుక్రవారం తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంక్షేమం కోసం నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సాయిబాబా మాట్లాడారు. రైల్వే డాక్టర్ రెహానా, యూనియన్ నాయకులు కిషోర్‌కుమార్, నాగరాజునాయక్, మురళీకృష్ణ, బ్రాంచి అధ్యక్షుడు బాలాజీరావు, సెక్రటరీ రవి, కోశాధికారి పోలయ్య, రేణిగుంట సర్పంచ్ నగేషం, గుంతకల్ డివిజన్‌లోని అన్ని బ్రాంచిల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఆలిండియా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. రేణిగుంటలోని బ్రాంచి కార్యాలయంలో చీఫ్ అడ్వైజర్ సంజీవరాయప్ప అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూనియన్ బ్రాంచి సెక్రటరీగా రిటైర్డ్ రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జయంత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే చైర్మన్‌గా వెంకటముని, వర్కింగ్ చైర్మన్‌గా చొక్కలింగం, రామ్మూర్తి, ట్రెజరర్‌గా అన్బు, సహాయ ట్రెజరర్‌గా గురుస్వామి, వైస్ చైర్మన్లుగా మునీర్‌బాషా, శంకరయ్య, అన్వర్‌బాషా, రవిచంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా కృష్ణమనాయుడు, జ్ఞానశేఖర్, సుబ్రమణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బ్రాంచి సెక్రటరీ జయంత్‌కుమార్ తెలిపారు.

కన్నలి చెరువు నీళ్లు ఇవ్వరూ!

- పొయ్య పంచాయతీ రైతుల నివేదన'



నీరు పారనీయకుండా అడ్డుకట్టగా వేసిన ఇసుక బస్తాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పెద్ద కన్నలి చెరువు నుంచి పలు గ్రామాల పొలాలకు నీటిపారుదల ఉంది. అయితే పక్కనే ఉన్న కల్లిపూడికి చెందిన రైతులు పొయ్య పంచాయతీకి సంబంధించిన పొలాలకు నీరు పారనీయకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్నారని పొయ్య రైతులు వాపోతున్నారు. ఈ చెరువు ఆయకట్టు కింద 500 ఎకరాలు ఉంది. నీటి పారుదల లేకుండా చేయడంతో వరి పంట ఎండిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై పొయ్య రైతులు ప్రశ్నిస్తే..తొలుత తమ పొలాలకు నీరు పారించిన తర్వాతే ఇస్తామని కల్లిపూడి వాసులు చెబుతున్నారని నిరసిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాజు, హాజరైన వివిధ శాఖల అధికారులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): సామాజిక తనిఖీల బృందం శనివారం నుంచి 27వ తేదీ వరకు మండలంలో వివిధ పనులను తనిఖీ చేయనున్నట్టు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్టేట్ రిసోర్స్ పర్సన్ జెఎస్ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీల బృందం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని 27 పంచాయతీల అభివృద్ధి పథకాలకు వివిధ శాఖలకు 2020 మార్చి నుంచి 2022 మార్చి వరకు రూ.16.35కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఈ పనులకు సంబంధించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి మాట్లాడుతూ, గ్రామాలలో పర్యటించే సామాజిక తనిఖీ బృందాలకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌పీలు, ఏపీఓ సుజాత, ఉపాధి హామీ సిబ్బంది హౌసింగ్ ఏఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధుల కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

శ్రీకాళహస్తి రూరల్: జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాలకు చెందిన వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకునే అన్ని రకాల రుణాలు జీవనోపాధుల కల్పనకు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, సురక్షబీమాపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించాన్నారు. జగనన్న తోడు రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రుణాలు ఇప్పించాలన్నారు. జగనన్న హౌసింగ్ లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తి చేయటానికి డ్వాక్రా సంఘం ద్వారా రూ.35 వేలు రుణం మంజూరు చేయించాలని తెలిపారు. కిశోర బాలికలు, గర్భవతులు, బాలింతలు అనీమియా నుంచి బయట పడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంఘాల సమావేశాల్లో విస్తృతంగా చర్చించి తగు చర్యలు తీసుకోవాలి చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, డీపీఎంలు విజయ, వనజాక్షి, మాధవి, ఏరియా కోఆర్డినేటర్ డాంగేయాదవ్, జిల్లా ఏపీఎంలు సుబ్బారెడ్డి, సింగన్న, ఆదినారాయణ, విజయ్‌కుమార్, నరసింహులు, ద్రాక్షాయణి, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ నెల 19న రాత్రి 7 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు కింద పడేసి, వాటిలో ఒక దానిని ధ్వంసం చేశారు. అందులోని రూ.84 వేల విలువైన రాగివైరును చోరీ చేశారు. ఎస్పీడీసీఎల్ పాపానాయుడుపేట సెక్షన్ ఏఈ మునికుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మట్టి రోడ్డు వేశారు



రోడ్డు పనులు చేస్తున్న జేసీబీ

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ నుంచి ఆరులేన్ల రోడ్డు వరకు శుక్రవారం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో మట్టి రోడ్డు వేశారు. కాలనీ నుంచి సుమారు 150 మీటర్ల దూరంలో నూతనంగా ఆరులేన్ల రోడ్డు ఏర్పాటు వేస్తున్నారు. అంతదూరం వెళ్లి బస్సులు ఎక్కడానికి సరైన రోడ్డులేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సర్పంచ్‌కు విన్నవించడంతో ట్రిప్పర్లతో మట్టిని తోలి రోడ్డు వేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



పెంచలయ్య కుటుంబ సభ్యులకు నగదు ఇస్తున్న ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలోని వెలంపాడు ఎస్టీ కాలనీకి చెందిన వేలాయుధం (58) మంగళవారం, అరుంధతివాడకు చెందిన పెంచలయ్య(52) అనారోగ్యంతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా శుక్రవారం మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కార్యాలయంలో రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంద్ర రఘునాయుడు, ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జ్వరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు, తంగేళ్లపాళెం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు దోమల వలన సంక్రమించే విషజ్వరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లార్వాల నిర్మూలనపై హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలను నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, మురుగు కాలువల్లో వారానికోసారి వేస్ట్ యిల్ లేదా కిరోసిన్ చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు సంబంధంశెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్ : మహిళను కిడ్నాప్ చేసి లైంగిక దాడి చేసిన కేసులో వెదురుకుప్పం మండలం బాలాజీపల్లి దళితవాడకు చెందిన కావలి నాగరాజుకు ఫిబ్రవరి 2 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గురువారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. నిందితుడు నాగరాజు తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఒక విద్యా సంస్థలో స్వీపర్‌గా పనిచేస్తున్న తన గ్రామానికి చెందిన మహిళను గత ఏడాది నవంబర్ 17న బైక్‌లో ఎక్కించుకుని తీసుకెళ్లాడు. ఒక గదిలో నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాకాల మండలం దామలచెరువు తీసుకెళ్లి అక్కడా దాడి చేశాడు. బాధితురాలు దిశా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేసి నిందితుడు నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



అమ్మవారి ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి శుక్రవారం వాయులింగేశ్వరుని అభిషేకం, దీపారాధన అనంతరం ఘనంగా శుక్రవార ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి గర్భాలయం ఎదుట ఉన్న మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

నేడు తై అమావాస్య పూజలు

తై అమావాస్య పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. స్వామి అమ్మవారిని భరద్వాజ తీర్థంలోని శివాలయం వద్దకు తీసుకెళ్లి విశేష అభిషేకం నిర్వహించి నైవేద్యం, మంత్రపుష్పం, హారతులు సమర్పిస్తారు. అలంకరణ అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో వీరరాఘవస్వామి

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం సాయంత్రం గణపతి పూజతో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం స్వామివారి కల్యాణం, రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం గరుడసేవ, ఆదివారం ఉదయం హనుమంత వాహన సేవ, రాత్రి చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తవుతాయని దేవస్థానం ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలను అందజేశారు.

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న కోకకోలా సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి: అప్రమత్తతతోనే ప్రమాదాలకు అడ్డుక ట్ట వేయగలని పలువురు అధికారులు అన్నారు. పట్టణంలో శుక్రవారం కోకకోలా కంపెనీ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారుల తప్పనిసరి గా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫి క్ నిబంధనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, కోకకోలా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): జాతీయ రహదారి రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ హైవే అథారిటీస్, దీపా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రయాణ సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని కోరారు. అలాగే రోడ్డు ప్రమాదాల వలన కలిగే అనర్థాలను యమధర్మరాజు, చిత్రగుప్తుడు వేషధారణతో లఘునాటిక ప్రదర్శించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



ఆందోళన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తిరుపతి అర్బన్: సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ పి.విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి జే.ధన్వంత్‌కుమార్ తెలిపారు. వారు శుక్రవారం ఉద్యోగులతో కలిసి భోజన విరామ సమయంలో తిరుపతిలోని తీర్థకట్ట వీధిలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గతేడాది నవంబర్‌లో ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించడం దారుణమన్నారు. ఈ క్రమంలో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 12వ ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసింహులు, జనార్ధన్, భాస్కర్, మహేష్, పవన్, నందగోపాల్, లక్ష్మీపతి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతిలోని గోవిందరాజులస్వామి ఆలయం సమీపంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. టి.బాబు, కృష్ణమోహన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.12 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి చెక్కు ఇస్తున్న రాఘవేంద్ర

తిరుపతి అలిపిరి: శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ ట్రస్టుకు శుక్రవారం రూ.12 లక్షలు విరాళంగా అందింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి దాతలు విరాళం చెక్కు అందజేశారు. హైదరాబాదుకు చెందిన ఈవీఎస్ఆర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున వారి ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర రూ.10,00,116 విరాళం ఇచ్చారు. అదేవిధంగా బెంగళూరుకు చెందిన కేసీ రెడ్డి, సరోజమ్మ వెల్ఫేర్ ఫౌండేషన్ తరపున ఎస్వీబీసీ బోర్డు సభ్యురాలు వసంత కవిత రూ.2 లక్షలను విరాళాన్ని ఈఓ ధర్మారెడ్డికి అందజేశారు.